క్లుప్తంగా

మెరుగైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన

కె.గంగవరం: మండల పరిధిలోని కుందూరులో వ్యవసాయ శాఖ సిబ్బంది మెరుగైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సీహెచ్ సద్గురుమూర్తి మాట్లాడుతూ వరి పైరులో జీవించే సహజ మిత్ర పురుగులను రక్షించుకోవాలన్నారు. అనంతరం వరిలో సుడి దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. త్రిమెన్ కమిటీ సభ్యుడు నాయుడు, వీఏఏలు రేవతి, ప్రకృతి వ్యయసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



బాలిక దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలిక సంరక్షణ కోసం తీసుకోవల్సిన చర్యలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, మాణిక్యంబ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, రక్షణ, విద్యా పురోగతిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆటపాటల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు ఎంపీపీ బహుమతులు అందించారు. ఎంఈఓ నాగరాజు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు అమ్మకు స్వరనీరాజన కార్యక్రమం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు అమ్మకు స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గ ప్రత్యేక ఆహ్వానితుడు, ప్రముఖ హోమియో వైద్యుడు డా.చల్లా రవికుమార్, సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకురాలు డా.చల్లా మెహర్ ప్రసన్న ఆధ్వర్యంలో అమ్మ పాటల ఆలాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. డా.రవికుమార్ మాతృమూర్తి చల్లా లక్ష్మి సంస్మరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు గుర్తించాలి



వాకతిప్ప గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీడీ నాని

కపిలేశ్వరపురం: గ్రామాల్లో పారదర్శకంగా ఉపాధి పనులను గుర్తించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కంఠంశెట్టి నాని సూచించారు. మండలంలోని నాగులచెరువు, వాకతిప్ప గ్రామాల్లో శనివారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి పనులు గుర్తింపు కోసం గ్రామసభలను నిర్వహించారు. వాకతిప్ప సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగ స్రవంతి అధ్యక్షతన పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేశ్వరి, గణేష్‌లు వివరించారు. పనుల ప్రాధాన్యాలపై రైతులతో చర్చించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ నాని మాట్లాడుతూ గ్రామాల్లోని ఉపాధి కూలీలందరికీ నూరుశాతం ఉపాధి కల్పనే లక్ష్యంగా పనులను గుర్తించాలన్నారు. ఉపాధి కూలీలంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. నాగులచెరువులో 35, వాకతిప్పలో 65 పనులను గుర్తించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్, ఏపీఓ రంజిత్‌కుమార్, గ్రామాల కార్యదర్శి కృష్ణ, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం డిప్యూటీ ఎంపీడీఓగా వరప్రసాద్‌బాబు



కపిలేశ్వరపురం: మండల డిప్యూటీ ఎంపీడీఓగా మండపేట మండలం మారేడుబాక గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి బూసి వరప్రసాద్ బాబు నియమితులయ్యారు. మారేడుబాకలో పనిచేస్తుండగా పదోన్నతి పొందారు. 1993లో వీడీఓగా ప్రభుత్వ సర్వీసులోకి వచ్చిన వరప్రసాద్‌బాబు గతంలో వీడీఓగా కపిలేశ్వరపురం, ఆలమూరు, రావులపాలెం మండలాల్లో పనిచేశారు. తర్వాత కాలంలో గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గానూ, చింతలూరు, జొన్నాడ, ఊబలంక మారేడుబాక గ్రామాల కార్యదర్శిగానూ సేవలందించారు.

రవికుమార్‌కు పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మాతృవియోగంతో బాధపడుతున్న మండపేట పట్టణానికి చెందిన హోమియో వైద్యుడు డా.చల్లా రవికుమార్‌ను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చుండ్రు శ్రీవరప్రకాష్ శనివారం పరామర్శించారు. రవికుమార్ మాతృమూర్తి లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

మందులిచ్చి పంపేస్తున్నారు

- వైద్యుల సమ్మెతో అవస్థలు
- న్యాయసమ్మతమైన వైద్యుల డిమాండ్లు
- సానుకూలంగా స్పందించని ప్రభుత్వం
- గత నెల 29 నుంచి సమ్మె
- పలుమార్లు విఫలమైన ప్రభుత్వంతో చర్చలు
- స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టుల సేవలే దిక్కు



విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న వైద్యుల్లో రామచంద్రపురం డివిజన్ పరిధిలోని వైద్యులు

కపిలేశ్వరపురం: పేదల వైద్యం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు పరం చేస్తోంది. ఒక పక్క ఎన్టీఆర్ ఆరోగ్యవైద్య సేవలు నిలిచిపోయాయి. మరోపక్క క్షేత్ర స్థాయిలోని పీహెచ్‌సీల వైద్యుల డిమాండ్లను ప్రభుత్వం విస్మరిస్తుండటంతో సమ్మె జరుగుతుంది. పీహెచ్‌సీ వైద్యులు అనేక మార్లు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. సమ్మెకు వెళ్లకుండా పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వైద్యులు సమ్మెకు దిగారు. క్షేత్ర స్థాయిలోని పీహెచ్‌సీల్లో ఫార్మసిస్టులు ఇస్తున్న మందులే సామాన్య రోగులకు దిక్కవుతున్నాయి. ఆసుపత్రుల్లో సేవల నాణ్యత కొరవడటంతో సామాజిక ఆరోగ్యం ప్రమాదంలో పడింది. వైద్యుల న్యాయపరమైన సమ్మె, ప్రభుత్వ నిర్లక్ష్యం, రోగుల అవస్థలపై ఈ కథనం...

సమ్మె నేపథ్యమిదీ..

వైద్యులు తమ గోడును చెప్పి చెప్పి విసిగిపోయారు. మాటలతో వినని ప్రభుత్వానికి రాజ్యాంగం కల్పించిన సమ్మె హక్కుతో గట్టిగా చెబుదామని సమ్మెకు దిగారు. తమ డిమాండ్ల సాధనకై నేరుగా సమ్మెకు దిగకుండా 26 నుంచి మూడు రోజులు పాటు వైద్యసేవలందిస్తూనే నల్లరిబ్బన్లు ధరించి నిరసనను తెలిపారు. ప్రభుత్వం ఏమాత్రమూ ఖాతరు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీల వైద్యులు నిబంధనలు మేరకు ముందస్తు సమ్మె నోటీసు ఇచ్చారు. అయినా స్పందించకపోవడంతో ఈ ఏడాది సెప్టెంబర్ 29న సమ్మెను ప్రారంభించగా నేటికీ కొనసాగుతోంది. సమ్మెలో ఉన్నప్పటికీ కొద్ది రోజులు మానవతా దృక్పథంతో ఎమర్జెన్సీ సర్వీసులకు హాజరయ్యారు. ఇక ఏమాత్రమూ ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో డిమాండ్లు సాధనకై పూర్తి స్థాయి సమ్మెలోకి దిగారు. 20 రోజులుగా సమ్మె కొనసాగుతుండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులు అవస్థలు పడుతున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన డిమాండ్లు ఇవీ..

- కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జీఓ నంబర్ 99 ద్వారా ఆరు బ్రాంచిల నిబంధన తెరమీదికి తెచ్చింది. దీని ప్రకారం 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా బ్రాంచిలకు మాత్రమే వర్తింపజేసింది. ఇలా చేయడం తమకు అన్యాయం చేయడమేనని వైద్యులు ఏడాదికాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. జీఓ నంబర్ 99ను ఉపసంహరించుకుని ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.
- గత 20 ఏళ్లగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పని చేస్తున్న ఎంతో మంది పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతులు లేకుండా పోయాయి. వారికి పదోన్నతులు ఇస్తామని ఎన్నికల సమయంలో వైద్యుల అసోసియేషన్ నాయకులకు హామీ సైతం ఇచ్చారు. టైమ్ బాండ్ పదోన్నతులు కలిపించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.
- గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు 50 శాతం మూల వేతనాన్ని గిరిజన భత్యంగా అందించాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్ కోసం ఫైల్ పెట్టినా ప్రభుత్వం తిరస్కరిస్తోంది. పైగా రిజెక్ట్ అయినట్టు చెబుతూ వస్తుంది. వెంటనే నోషనల్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలన్నది మరో డిమాండ్.
- చంద్రన్న సంచార చికిత్సా కార్యక్రమానికి రూ.5 వేల భత్యం ఇవ్వాలి.

రామచంద్రపురం డివిజన్‌లో వైద్యుల సమ్మె ఇలా...

జిల్లా వ్యాప్తంగా 53 పీహెచ్‌సీలుండగా అందులో రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉన్న పీహెచ్‌సీలు 13. వాటిలో రెండు పీహెచ్‌సీల వైద్యులు మినహా మిగిలిన పీహెచ్‌సీల వైద్యులంతా సమ్మెలో కొనసాగుతున్నారు. సుమారు 91 మంది వైద్యులకు గాను 77 మంది వైద్యులు సమ్మెలో కొనసాగుతున్నారు.

రాజధాని కేంద్రంగా మొక్కవోని దీక్షతో ఉద్యమం..

వైద్యులు తమ గోడు చెప్పుకునే కేంద్రంగా రాష్ట్ర రాజధాని అమరావతి ధర్నా చౌక్‌ను ఎంచుకున్నారు. క్రమం తప్పకుండా నిరసన శిబిరంలో పాల్గొని నినాదాలు చేస్తున్నారు. దూరాభారాన్ని లెక్క చేయకుండా అన్ని జిల్లాల నుంచీ వైద్యులు విజయవాడ వెళ్తున్నారు. తమ ఆందోళనను గౌరవించి ప్రభుత్వం చర్చలను సానుకూలంగా జరిపి పరిష్కరిస్తుందన్న ఆశతోనూ, మొక్కవోని దీక్షతో ఆందోళన కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి రోగులు సతమతం...

పీహెచ్‌సీ వైద్యులు ద్వారా అందాలసిన సేవలన్నీ నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ క్యాంపుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నాణ్యత తీసికట్టుగా మారింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పీహెచ్‌సీల్లో ఓపీ తగ్గిపోతుంది. ప్రైవేటు ఆసుపత్రులు ఆశ్రయిస్తున్నారు. మరోమార్గం లేక వచ్చిన రోగులను స్టాఫ్ నర్సు పరీక్షించి మందులను రాస్తుండగా ఫార్మసిస్టు మందులు ఇచ్చి పంపేస్తున్నారు.

న్యాయ సమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలి



ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లన్నీ న్యాయసమ్మతమైనవే. గతంలో ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్ళి నోటిమాటగా కోరినవే. తప్పని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చింది. వైద్యులంతా మానవతా దృక్పథంతో సామాన్య రోగులందరికీ వైద్యసేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించగలది ఆశిస్తున్నాం.

– డా.ఎస్.కరుణేంద్రకుమారి, ఉపాధ్యక్షురాలు, ఏపీపీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్, అచ్యుతాపురం

రోగుల అవస్థలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలి



వైద్యుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. క్షేత్ర స్థాయిలో సామాన్య రోగుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వైద్యులతో చర్చలు జరపాలి. సమ్మెలో కీలక డిమాండ్లను పరిష్కరించాలి.

– పేరాబత్తుల రామకృష్ణ, కోరుమిల్లి, కపిలేశ్వరపురం

87 క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో సమావేశాల నిర్వహణ



పి.గన్నవరం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో డాక్టర్ సలీంబాషా

రాయవరం: జిల్లా వ్యాప్తంగా 87 క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. సమగ్ర శిక్షా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల నిర్వహించిన అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపించిన ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,588 మంది ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పి.గన్నవరం, బండారులంక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొని ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ ఆలమూరు మండలం చెముడులంక, నర్సిపూడి, కొత్తూరు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొని ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అలాగే ఉప విద్యాశాఖాధికారులు జి.సూర్యప్రకాశరావు, పి.రామలక్ష్మణమూర్తి, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌కుమార్, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, డీఎస్‌వో జీవీఎస్ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారులు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను పర్యవేక్షించారు.

చెకుముకి సంబరాలు ప్రారంభం



వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెకుముకి వైజ్ఞానిక పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: చెకుముకి సంబరాలు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో శనివారం ప్రారంభమయ్యాయి. కపిలేశ్వరపురం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 765 మంది విద్యార్థులు విద్యా, వైజ్ఞానిక పరీక్షలో పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు వాసంశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో సంబరాలు జరిగాయి. కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 మంది, నల్లూరు పాఠశాలలో 65, మాచర పాఠశాలలో 80, అంగర పాఠశాలలో 40, కపిలేశ్వరపురం పాఠశాలలో 34, వాకతిప్ప పాఠశాలలో 15, టేకి పాఠశాలలో 50, వల్లూరు పాఠశాలలో 50, అంగరలోని శ్రీరామకృష్ణ ప్రైవేటు హైస్కూల్‌లో 210, విద్యానికేతన్ హైస్కూల్‌లో 167, టేకి ప్రగతి ప్రైవేటు హైస్కూల్‌లో 34 మంది మొత్తం 765 మంది విద్యార్థులు పరీక్ష రాసారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల బృందాలుతో నవంబర్ 1న మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాక్షేత్రంలో కూటమికి గుణపాఠం తప్పదు



గొల్లపాలెంలో ఉంగరాల శివ పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చెయ్యలేరని ప్రజాక్షేత్రంలో త్వరలో వారికి గుణపాఠం తప్పదని వైఎస్సార్ సీపీ యువజన విభాగ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గొల్లపాలెంకు చెందిన యువజన విభాగ కార్యదర్శి ఉంగరాల శివ అనారోగ్యానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సూర్యప్రకాశ్, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు మాదిరెడ్డి ప్రద్వీరాగ్ తదితరులు ఉంగరాల శివను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యప్రకాశ్ గ్రామంలో కార్యకర్తలను కలుసుకుని ప్రజాసమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు వల్లెవేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు మండల యువజన విభాగ అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, పార్టీ కార్యకర్తలు పెంకే సుబ్బారావు, కంచి వెంకటేశ్వర్రావు, అనసూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాలుష్యాన్ని తగ్గించాలంటూ సైకిల్ ర్యాలీ



హసన్‌బాదలో సైకిల్ ర్యాలీలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, అధికారులు



కాజులూరులో వివిధ శాఖల సిబ్బందితో కలిసి మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రాంబాబు

రామచంద్రపురం రూరల్: వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించడానికి మనవంతు కృషి చేయాలని కోరుతూ హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో సర్పంచ్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యుడు చోడిశెట్టి వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శి సబ్బెళ్ల ప్రసాద్‌రెడ్డి, వీఆర్ఓ నరహరిశెట్టి సత్తిబాబు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యరహిత పట్టణంగా మండపేట

కపిలేశ్వరపురం (మండపేట): కాలుష్య నివారణ పట్టణంగా మండపేటను తీర్చిదిద్దేందుకు పట్టణవాసులంతా సహకరించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో శనివారం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలపై స్వచ్ఛత ర్యాలీ, బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో, కమర్షియల్ టాక్స్ శాఖ, మున్సిపల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కాజులూరు: గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీఓ జె.రాంబాబు అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాజులూరులో అధికారులు, నాయకులు పారిశుధ్య నిర్వహణపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల మొక్కలు నాటారు. వెలుగు, ఉపాధి హామీ, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామానుజన్ జీవితం స్ఫూర్తిదాయకం



రామచంద్రపురంలో గణిత అకాడమీని సందర్శించిన కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావుల్లో ఒకరిగా పేరు గడించిన మన దేశ శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ సూచించారు. రాజమహేంద్రవరం శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు రామానుజన్ గణిత అకాడమీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విద్యార్థులకు రామానుజన్ సాధించిన విజయాలు, గణితశాస్త్రంలో ఆయన కనిపెట్టిన 3,900 ఫలితాలను వివరించారు. కళాశాల అధ్యాపకులు ఎం.వీ.రాజు, ఎమ్మెస్ చక్రవర్తి, బి. భువనేశ్వరి తదితరులు మాట్లాడుతూ అంకిత భావంతో మంచి వ్యవస్థను నిర్మించి నిర్వహిస్తున్న కేవీవీ సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రామానుజన్ గణిత లైబ్రరీని విద్యార్థులు సందర్శించారు.

దీపావళి కాంతులు



వల్లూరులో పర్యావరణ హితంగా దీపావళి ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మండపేట యాపిల్ ప్లే స్కూల్‌లో దీపాలతో అలంకరించిన చెట్టు చిత్రం

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్ గ్రామాలు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో శనివారం దీపావళి వేడుకను ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరు మోడల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ పర్యవేక్షణలో విద్యార్థులు పర్యావరణ హిత పద్ధతిలో దీపావళిని జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, రామతులసి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేటలో..

పట్టణంలోని ఎంపీఎస్ జూనియర్ కళాశాలలో దుర్గుణాలను విడనాడాలనే లక్ష్యంతో విద్యార్థులు దీపావళిని జరుపుకొన్నారు. కళాశాల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు పర్యవేక్షణలో విద్యార్థులు 20 అడుగుల నరకాసురుని విగ్రహాన్ని దగ్ధం చేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి సందడి చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ళు దేవళ్ళ సాయి గంగాధర్, గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆపిల్ ప్లే స్కూల్‌లో చిన్నారులు సందడి చేశారు. పర్యావరణాన్ని రక్షించుకుంటూ దీపావళిని జరుపుకోవాలంటూ చిన్నారులు వినూత్నంగా జరుపుకున్నారు. నేలపై చెట్టు చిత్రానికి దీపాలను అలంకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు లక్ష్మీపూజ చేశారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి



కాజులూరులో బాణసంచా వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: బాణసంచా వ్యాపారులు దుకాణాల ఏర్పాటులో ప్రమాదాల నివారణకు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం, కాజులూరులో ఎస్సై మోహన్‌కుమార్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పర్యటించి బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించి, వ్యాపారులకు పలు సూచనలు చేశారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, నిబంధనలు అతిక్రమించి సరుకు నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితి ప్రకారం బాణ సంచా తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండలంలోని నాలుగు ప్రధాన గ్రామాల్లో ఇప్పటి వరకూ 12 షాపులకు వ్యాపారులు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.

సోలార్ విద్యుత్‌తో అధిక ప్రయోజనం

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకంలో లబ్ధిదారులు సోలార్‌కు మారితే అధిక ప్రయోజనం చేకూరుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు, డీఈఈ ఎస్.శ్రీనివాసరావు, ఏఈ మేడిశెట్టి వెంకటరమణ తెలిపారు. సోలార్ విద్యుత్ పరికరాలపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని వారు తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో ప్రధాన రహదారిపై ప్రజలు, వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు నిర్వహించేవారికి అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సోలార్‌కు మారడం ద్వారా 90 శాతం వరకు విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు. ప్రభుత్వం సబ్సిడీ రూ.78 వేలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, రామచంద్రపురం మున్సిపల్ చీఫ్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, మున్సిపల్ కమీషనర్ కేవీఆర్ఆర్ రాజు, డీఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిడ్‌రాజు, నాయకులు పెంటపాటి శ్రీనివాస్, వైట్ల ప్రకాశ్, గుబ్బల ఏసురాజు, పెంకే సాంబశివరావు, డివిజనల్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ధ్యానంపై ప్రత్యేక శిక్షణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం హైదరాబాద్‌కు చెందిన విపాసన మెడిటేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ధ్యానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిల్లి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత, పాజిటివ్ థింకింగ్ అలవడతాయని తెలిపారు. సంస్థ ప్రతినిధులు ప్రహ్లాద్ తరిగొప్పుల, శివకుమార్, శ్రీకాంత్ నాయుడులు గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు ధ్యానంలో శిక్షణ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతా శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీ శంకర్, సీఆర్ఎంటీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.